# 6వ రాష్ట్ర మహాసభల ప్రధాన కార్యదర్శి నివేదిక

ఒకవైపు ప్రజలమీద అణచివేత మరొకవైపు ప్రజలలో పౌరహక్కుల చైతన్యం రోజురోజుకూ పెరుగుతూవున్న తరుణంలో మనం మన 6వ రాష్ట్ర మహాసభలను జరుపుకుంటున్నాం. అణచివేత రాశిలో పెరగడమేకాక ఆధునిక సాంకేతిక రూపాలను విరివిగా వాడుకుంటోంది. రెండేళ్ళ వ్యవధిలో సాధారణ పోలీసు సిబ్బందిచేతిలోవున్న మారణాయుధాలు చాలా ఆధునికం అయినాయి. ప్రజా ఉద్యమాలపైన నిఘా వేయడానికీ అణచివేత ప్రయోగించడానికీ పోలీసు యంత్రాంగం చేతిలోవున్న రవాణా సాధనాలు, ప్రసార సాధనాలూ ప్రభుత్వం చేతిలోవున్న ప్రచారసాధనాలుకూడా ఆధునికం అయ్యాయి. అప్రజాస్వామికమైన శాసనాలనూ నల్ల చట్టాలనూ తయారు చేయడంలోనూ ప్రభుత్వం ఎన్నడూ లేనంత నిర్లజ్జగా ప్రవర్తిస్తోంది. టెర్రరిస్టు ప్రాంతాల ప్రత్యేక కోర్టుల చట్టం, టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల చట్టం, ఇందుకు స్పష్టమయిన నిదర్శనాలు. ఈ చట్టాలు చేయడంతో శాసన రూపంలో జరిగే అణచివేత ఒక్కసారిగా గుణాత్మకంగా పెరిగిందని చెప్పవచ్చును.

ఇటు ప్రజలలో తమ హక్కులపట్ల చైతన్యం కూడ ఈ రెండేళ్ళలో చాలా పెరిగింది. రాజకీయ ఉద్యమాలు, కార్మిక రైతాంగ ఉద్యమాలు, మధ్య తరగతి ఉద్యోగుల ఉద్యమాలు మాత్రమేకాక పౌరహక్కుల పరిరక్షణ కోసం కూడ ఇవాళ అలజడి విస్తృతంగా జరుగుతోంది. అది ఉద్యమాల స్థాయిలో ఉందా లేదా అన్నది వివాదాస్పదం కావచ్చును గానీ పౌరహక్కుల చైతన్యం స్తబ్ధంగా లేదనేది మట్టుకు నిర్వివాదమయిన విషయం. నల్ల చట్టాలపట్ల, పోలీసు అత్యాచారాలపట్ల ఒక సాధారణ స్పందన ఇవ్వాళ మనం గమనించాలి. 59వ రాజ్యాంగ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన అలజడిలో కొన్ని లక్షల మంది జనం పాల్గొన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయాలని చూసిన పోలీస్ బిల్లు, ప్రెస్ బిల్లులనూ కేంద్ర ప్రభుత్వం జారీ చేయాలని ప్రయత్నించిన పరువునష్టం బిల్లునూ కేవలం మేధావి వర్గాలూ పాత్రికేయులేకాక సామాన్య ప్రజానీకం కూడ వ్యతిరేకించారు. పోలీసు అత్యాచారాలపట్ల కూడ కేవలం రాజకీయంగా చైతన్యవంతులయిన వ్యక్తులూ సంఘాలేకాక, సామాన్య ప్రజానీకంకూడ అశేష సంఖ్యలో నిరసన తెలుపుతున్నారు. బంద్‌లు నిర్వహిస్తున్నారు, ఊరేగింపులు తీస్తున్నారు, అప్పుడప్పుడు కోపోద్రేకంలో పోలీస్ స్టేషన్లపైన దాడికూడ చేస్తున్నారు.

పెరుగుతున్న అణచివేత, పెరుగుతున్న చైతన్యం అనే రెండు ప్రధాన అంశాలతో కూడిన నేపథ్యంలో మనం ఇవ్వాళ పని చేస్తున్నాం. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గత రెండు సంవత్సరాల కార్యక్రమాలనూ సంస్థ నిర్మాణ పరిస్థితినీ చర్చించుకోవాలి. మొదట పౌరహక్కుల అవగాహనలో మనకు ఇవ్వాళ కనిపించే విస్తృతిని చర్చించి ఆ తరువాత ఒక్కొక్క రంగంలోనూ మనం చేసిన పనినీ చేయలేకపోయిన పనినీ సంస్థ నిర్మాణ సమస్యలనూ చర్చించుకుందాం.

## పౌరహక్కుల అవగాహన

రాజకీయ ఉద్యమాలమీద, ప్రజాపోరాటాలమీద నిర్బంధం వచ్చినప్పుడే ప్రపంచంలో ఎక్కడయినా పౌరహక్కుల ఉద్యమాలు పుట్టాయి. ఆమెరికా బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల నుండి భారత దేశందాకా ఏ దేశంలో పౌరహక్కుల ఉద్యమం చరిత్రను పరిశీలించినా ఈ వాస్తవం మనకు కనిపిస్తుంది. అయితే తరచుగా ఆ రాజకీయ పరిస్థితులు మారగానే దానితోపాటు పౌరహక్కుల ఉద్యమము స్తబ్ధమయి పోవడం జరుగుతూ వచ్చింది. బ్రిటిష్ పాలన కాలంలో కాంగ్రెస్ నాయకుల ప్రోత్సాహంతో ఏర్పాటయిన Indian Civil Liberties Union ఆ కాంగ్రెసువారి చేతిలోకి అధికారం బదలాయింపు కాగానే రద్దయిపోయింది. నిజాం పరిపాలనలోని హైదరాబాద్ సంస్థానంలో ఆర్య సమాజం ప్రోత్సాహంతో ప్రారంభమయిన హిందూ సివిల్ లిబర్టీస్ యూనియన్ పోలీస్ చర్య తరువాత రద్దయిపోయింది. 1962 భారత చైనా యుద్ధమప్పుడు కమ్యూనిస్టు నాయకుల మీద దేశంలో జరిగిన అణచివేతపట్ల నిరసన తెలుపుతూ ముందుకొచ్చిన పౌరహక్కుల వేదిక ఆ సమస్య వెనక్కి పోవడంతో తానుకూడ స్తబ్ధమయిపోయింది.

ఇతర దేశాలలోని పౌరహక్కుల ఉద్యమాలు కూడ తొలినాడు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నప్పటికీ క్రమంగా పౌరహక్కుల ఉద్యమం తన స్వంత అస్తిత్వాన్ని సాధించుకోవడం మొదలయింది. మన దేశంలో ఈ పరిణామం ఈ దశాబ్దంలోనే రూపం తీసుకుంది. ఇవ్వాళ మన దేశంలో పని చేస్తున్న పౌరహక్కుల సంఘాలకు రెండు రాజకీయ నేపథ్యాలున్నాయి. ఒకటి, నక్సల్బరీలోనూ ఆ తరువాత ఇతర ప్రాంతాలలోనూ పెల్లుబికిన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం మీద ప్రభుత్వం ఉపయోగించిన అణచివేత, రెండవది జయప్రకాష్ నారాయణ్ తదితర ప్రతిపక్ష నాయకుల ప్రేరణతో బీహార్, గుజరాత్ రాష్ట్రాలలోనూ ఇతర ప్రాంతాలలోనూ అవినీతి అక్రమ పరిపాలననూ వ్యతిరేకిస్తూ నడిచిన ఉద్యమాల మీద ప్రభుత్వం ఉపయోగించిన అణచివేత. మొదటి ప్రేరణతో A. P. C. L. C., O. P. D. R., A. P. D. R., C. P. D. R. తదితర సంస్థలు ఏర్పడగా, రెండవ ప్రేరణతో P. U. C. L. ఏర్పడింది. కొంత కాలంపాటు ఈ సంఘాల ఆచరణ ఆయా నేపథ్యాల నుండి పుట్టిన సమస్యలకు పరిమితంకాగా, క్రమంగా అవి తమ ఆచరణను విస్తృతం చేసుకొంటూ ఒక స్వయం అస్తిత్వం, ఒక స్వంత అవగాహన కలిగిన పౌరహక్కుల ఉద్యమంవైపు దారితీస్తున్నాయి. ఈ అస్తిత్వం స్వరూపాన్ని అవగాహన లక్షణాలనూ అర్థం చేసుకోవడానికి ప్రస్తుతం పౌరహక్కుల ఉద్యమం చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించటమే సరయిన పద్ధతి అవుతుంది.

పౌరహక్కుల ఉద్యమం రాజకీయ ఉద్యమాలపైన ప్రజాపోరాటాలపైన ప్రభుత్వం ప్రయోగించే అణచివేతను వ్యతిరేకిస్తుంది. ఉద్యమకారుల అక్రమ నిర్బంధాన్నీ వాళ్ళపైన ప్రయో

గించే చిత్రహింసలనూ 'ఎన్‌కౌంటర్' హత్యలనూ వ్యతిరేకిస్తుంది. సభలపైన, సమావేశాలపైన, సమ్మెలపైనా, సంఘాలపైనా నిషేధాలను అణచివేతను వ్యతిరేకిస్తుంది. రాజకీయ కార్యకర్తలను విచారణ లేకుండ దీర్ఘకాలం జైలులో పెట్టడానికి ఉపయోగించే నాసా, టాడా వంటి అప్రజాస్వామిక శాసనాలను వ్యతిరేకిస్తుంది. ప్రజా ఉద్యమాలను ఆటంకపరిచే నల్లచట్టాలనూ వ్యతిరేకిస్తుంది. ఆ రాజకీయ ఉద్యమాల సిద్ధాంతంతోగానీ ఆ ప్రజాపోరాటాల వ్యూహం ఎత్తుగడలతోగానీ నిమిత్తం లేకుండ ఈ అణచివేతను వ్యతిరేకిస్తుంది. ఏ పోరాటమయినా ఉద్యమమయినా సామాజిక, ఆర్థిక సాంస్కృతిక రాజకీయ కారణాల నుండి పుడుతుందనీ అటువంటి ఉద్యమాలను శాంతి భద్రతల సమస్యగా చూడటం తప్పనీ పౌరహక్కుల ఉద్యమం అవగాహన. అంతేకాక, ఎంత తీవ్రమయిన శాంతి భద్రతల సమస్య పరిష్కారానికయినా అప్రజాస్వామిక పద్ధతులను వినియోగించడానికి వీలులేదని పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది.

రాజకీయ కార్యకర్తలు ప్రజా ఉద్యమాలేకాక సామాన్య ప్రజానీకం కూడ పోలీసు జులుంకు గురి అవుతుంటారు. తాము నిర్బంధం ప్రయోగించే రాజకీయ ఉద్యమాలకు తీవ్రవాదం అనీ ఉగ్రవాదం అనీ ప్రభుత్వం పేరు పెట్టినట్టే తాము జులుం ప్రయోగించే రాజకీయేతర ప్రజానీకానికి సంఘ వ్యతిరేక శక్తులు అనీ నేర ప్రవృత్తి గల వ్యక్తులనీ పోలీసులు పేర్లు పెడుతుంటారు. ఈ జులుంను కూడ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. నేరం రుజువయ్యేదాకా ఎవ్వరూ నేరస్తులు కారు కాబట్టి, ఆ రుజువు జరగవలసింది కోర్టులోనే తప్ప పోలీస్ స్టేషన్‌లో కాదుకాబట్టి, లాకప్పులో చిత్రహింసలను పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. అంతేకాక నేరం అనేది సమాజంలోని పేదరికం నిరుద్యోగం నికృష్టజీవనం తదితర అనేక సమస్యల నుండి పుడుతుందని పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది. ఆ సమస్యల పరిష్కారం ప్రభుత్వాల స్వాభావికమయిన బాధ్యత. ప్రత్యేకించి, భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అధ్యాయం ఆ బాధ్యతను ప్రభుత్వంమీద పెట్టింది. దానిని నిర్వర్తించడంలో విఫలమయిన ప్రభుత్వం ఆ వైఫల్యం నుండి పుట్టే 'శాంతి భద్రతల' సమస్యల పట్ల చట్ట వ్యతిరేకంగానూ అప్రజాస్వామికంగానూ వ్యవహరిస్తే పౌరహక్కుల ఉద్యమం సహించదు. లాకప్పులలో చిత్రహింసలను, లాకప్పు మరణాలనూ, అక్రమ సోదాలనూ, జప్తులనూ, అన్యాయమయిన నేరవిచారణ పద్ధతులనూ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది.

ప్రత్యక్ష బలప్రయోగం రూపంలో జరిగే ఈ అణచివేతకే పౌరహక్కుల అవగాహన పరిమితంకాదు. మనుషులకు కనీస జీవనం, స్వేచ్ఛ, సమానత్వాలను ఇచ్చే గౌరవప్రదమైన జీవితం ఒక మౌలికమయిన హక్కు అని పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది. వీటికి ఏ రూపంలో భంగం కలిగినా వ్యతిరేకిస్తుంది. అది అభివృద్ధి పేరుమీద జరిగినా ప్రగతి పేరుమీద జరిగినా దేశసమైక్యత పేరు మీద, శాంతిభద్రతల పరిరక్షణ పేరు మీద జరిగినా ఆ అణచివేతను పౌరహక్కుల ఉద్యమం ఉపేక్షించదు. ఈ అవగాహనతోనే గిరిజనుల జీవనానికి విఘాతం కలిగించే అడవి చట్టాలను దేశవ్యాప్తంగా పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకించింది. అభివృద్ధి పేరుమీద పెద్ద ప్రాజెక్టులు కట్టి లక్షలాది పేదలను నిర్వాసితులను చేయడాన్ని కూడ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తూ వుంది. అణువిద్యుత్తు వంటి ప్రమాదకరమైన సాంకేతిక ప్రక్రియలను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వుంది. పారిశ్రామిక ప్రగతి పేరుమీద ప్రజల జీవనాన్ని నష్టపరిచే పరిసరాల కాలుష్యాన్ని వ్యతిరేకిస్తూ వుంది. పట్టణాలను అభివృద్ధి చేసే పేరుమీద గుడిసెవాసుల గుడిసెలను కూల్చేయడాన్ని వ్యతిరేకిస్తూ వుంది. ఈ సమస్యలపట్ల రకరకాల రాజకీయ అవగాహనలకు తావు ఉంది. రాజకీయ వివాదాలకు తావు వుంది. అయితే పౌరహక్కుల ఉద్యమం ఒక నిర్దిష్టమయిన పౌరహక్కుల అవగాహనతో పని చేస్తుంది. కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం, సమాచారం, మొదలయిన భౌతిక అవసరాలు, స్వేచ్ఛ సమానత్వాలూ, మనుషుల హక్కులు. అధికార యంత్రాంగం వీటికి ఏ పేరుమీదనైనా భంగం కలిగించడానికి వీలులేదు. ఈ కనీసమయిన ప్రజాస్వామిక దృక్పథం పౌరహక్కుల అవగాహనకు పునాది. ప్రజలకూ అధికార యంత్రాంగానికీ మధ్యనున్న వైరుధ్యంలో పౌరహక్కుల ఉద్యమం ప్రజల హక్కుల పక్షాన నిలుస్తుంది.

అయితే అధికారం అనేది అధికార యంత్రాంగం లేక రాజ్యాంగ యంత్రం రూపంలోనే కాక, అనేక సాంప్రదాయక సామాజిక ఆర్థిక రూపాలలోనూ వుంటుందని పౌరహక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. భూస్వాములు పెట్టుబడిదార్లు తదితర వర్గాలు కూలివాళ్ళమీద రైతులమీద ప్రయోగించే అణచివేతను పౌరహక్కుల సమస్యగా భావిస్తుంది. అయితే ఆర్థిక ప్రాతిపదిక మీద జరిగే ఈ అణచివేతే కాక కులవ్యవస్థ ఫలితంగా వెనుకబడ్డ కులాల మీద అగ్రవర్ణాల ఆధిపత్యం, పురుషాధిక్య వ్యవస్థ ఫలితంగా స్త్రీలపైన మగవాళ్ళకు ఉండే ఆధిపత్యం, మరి రెండు రాజ్యాంగేతర అధికార రూపాలు. ఈ ఆధిక్యతనూ పెత్తనాన్నీ తత్ఫలితమయిన అణచివేతనూ అసమానతనూ పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. ఈ అణచివేత రూపాలపట్ల కూడ అనేక రాజకీయ అవగాహనలకు తావు ఉంది. అయితే ఆ తేడాలలోకి పోకుండ అణచివేతనూ అసమానతనూ వ్యతిరేకించడం అనే కనీస ప్రజాస్వామిక అవగాహనతో పౌరహక్కుల ఉద్యమం పనిచేస్తుంది. గ్రామాలలో దళితులపైన అత్యాచారాలను, రిజర్వేషన్ల అమలులో వైఫల్యాన్ని, స్త్రీలపైన లైంగిక అత్యాచారాలనూ వరకట్న హత్యలనూ ఈదృష్టితోనే పౌరహక్కుల ఉద్యమం పౌరహక్కుల సమస్యలుగా భావిస్తుంది.

ఇప్పుడు వివిధ పౌరహక్కుల సమస్యల గురించి మనం గత రెండేళ్ళలో చేపట్టిన కార్యక్రమాలను సమీక్షిద్దాం.

## 1. 'ఎన్‌కౌంటర్లు'

గత రాష్ట్ర మహాసభల తరువాత మన రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ల సంఖ్య చాలా పెరిగింది. 1988 సంవత్సరంలో 62 మందిని 'ఎన్‌కౌంటర్ల'లో చంపారు. ఈ సంవత్సరం ఒక్క జనవరి నెలలోనే 20 మందికి పైగా చంపబడ్డారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన 172 'ఎన్‌కౌంటర్' హత్యలలో దాదాపు 123 ఈ రెండేళ్ళలోనే జరిగాయి. అంతేకాక 'ఎన్‌కౌంటర్ల' స్వభావంలోనూ 1988 తరువాత కొన్ని మార్పులు వచ్చాయి. 1988కి పూర్వం 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయిన వారిలో

అత్యధికులు (82%) నక్సలైట్ కార్యకర్తలు మిగిలిన 18% రైతులు, గిరిజనులు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులు తదితరులు. కాని 1988 జనవరి నుండి జరిగిన 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయిన వారిలో చాలా కొద్ది మంది (20%) నక్సలైట్ కార్యకర్తలు, తక్కిన 80 శాతం వారి సానుభూతిపరులో లేక మాజీ కార్యకర్తలో అయిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులు. అందరి కంటే ఎక్కువగా గిరిజనులు. అంతేకాకా 'ఎన్‌కౌంటర్ల'లో 'గుర్తుతెలియని వ్యక్తులను' చంపడం 1988 నుండే ఎక్కువ అయింది. 1981లో నల్గొండలో జరిగిన కొన్ని 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయినవారిని 'గుర్తు తెలియని తీవ్రవాదులు' అని ఆ రోజులలో ఎస్. పి. వ్యాస్ ప్రకటించాడు. ఆ తరువాత 1987 చివరిదాకా జరిగిన ఏ ఒక్క ఎన్‌కౌంటర్‌లోనూ హతుల గుర్తు తెలియకుండ పోలేదు. అయితే 1988 జనవరి తరువాత ఇవి మళ్ళీ మొదలయ్యి, ఇప్పటికీ 47 మంది 'గుర్తు తెలియని' వ్యక్తులు 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయారు. ఈ మార్పుల వెనక ఒక వాస్తవం వుంది నక్సలైట్ గ్రూపులకు చెందినవారు ఏదైనా ఒక గ్రామంలో ఏదైనా చర్య చేయగానే పోలీసులు వెంటనే రంగంలోకిదిగి, ఆ ప్రాంతానికి చెందిన ఒకరిద్దరు సానుభూతిపరులైన రైతులనో యువకులనో గిరిజనులను పట్టుకొని కాల్చేస్తున్నారు. అంతకుముందు జరిగిన చర్యలో పాల్గొన్న తీవ్రవాదులు వీళ్ళేనని, వాళ్ళను పట్టుకోవడానికి పోలీసులు పోగా వాళ్ళు లొంగిపోకుండ పోలీసుల మీదనే కాల్పులు జరిపారనీ పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరపగా చనిపోయారనీ ఒక ప్రకటన ఇస్తున్నారు. ఈ విధంగా ఒక వైపు ప్రజలను భయభ్రాంతులను చేయడం, మరొక వైపు తాము చాలా చురుగ్గా పని చేస్తున్నారన్న అభిప్రాయం కలిగించడం, పోలీసు యంత్రాంగం లక్ష్యంగా కనబడుతుంది. అయితే చనిపోయినవారి పేర్లు బయటపెడితే అసలు విషయం బయటపడిపోతుంది కాబట్టి, వాళ్ళను 'గుర్తు తెలియని తీవ్రవాదులు' అని వర్ణిస్తున్నారు.

గత రాష్ట్ర మహాసభల తర్వాత ఒక సంవత్సరకాలంపైగా మనం 'ఎన్‌కౌంటర్ల' గురించి ఎటువంటి కార్యక్రమమూ చేపట్టలేదు. ఎన్‌కౌంటర్లను ఖండిస్తూ మనం ప్రకటనలు కూడ ఇవ్వలేదు. అయితే గత ఆరు నెలలగా మళ్ళీ కొన్ని కార్యక్రమాలు చేపట్టాము. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌కౌంటర్ల పట్ల నిరసన తెలుపుతూ ఒక కరపత్రంవేసి పంచాము. హైదరాబాద్, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, కడప జిల్లా శాఖలు బహిరంగ సభలు నిర్వహించాయి. 'జీవించేహక్కు' అనే అంశంమీద మార్చి 12వ తేదీన హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించాము. బయటి రాష్ట్రాల నుండి రావలసి ఉండిన వక్తలంతా రాకపోయినా సదస్సు ఆసక్తికరంగా జరిగింది. జీవించే హక్కును కాపాడడానికి కోర్టులను ఉపయోగించుకోవడంలో ఉండే సమస్యలూ పరిమితులగురించి బొంబాయి మద్రాసుల నుండి వచ్చిన న్యాయవాదులు, ఎ. పి. సి. ఎల్. సి. బాధ్యులైన న్యాయవాదులు విపులంగా చర్చించారు.

ఈ సభలూ సమావేశాలేకాక 1988 సెప్టెంబర్ నెలలో ఒకసారి, డిసెంబర్ నెలలో ఒకసారి, 'ఎన్‌కౌంటర్ల' బూటకాన్ని ఎండగట్టే సమాచారం సేకరించి హైదరాబాద్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించాము. పత్రికలు బాగా స్పందించాయి. ముఖ్యంగా, 'ఎన్‌కౌంటర్ల'లో చంపుతున్నది రాజకీయ కార్యకర్తల కంటే అత్యధికంగా రైతులనూ గిరిజనులనూ అన్న విషయాన్ని సవివరంగా విపులీకరించగలిగాము.

అయితే నిజనిర్ధారణ కమిటీలను వేయడంలో మట్టుకు విఫలం అవుతున్నాము. 1985లో డా॥ రామనాథంగారి హత్య, 1986లో జాపా లక్ష్మారెడ్డిగారి హత్యల తరువాత మనం ఈ విషయంలో సహేతుకంగానే వెనకాడిన మాట వాస్తవమే. అయితే ఆ హత్యల పట్ల దేశవ్యాప్తంగా వ్యక్తమయిన నిరసన ఫలితంగానూ ఇతర కారణాలవల్లనూ ఇప్పుడు పరిస్థితి కొంత మెరుగుపడింది. అయితే మనం దానిని పూర్తిగా వినియోగించుకోవడంలేదు. వరంగల్ జిల్లా, జగ్గన్నగూడెం దగ్గర పూలమ్మను మరొక ఇద్దరినీ ఎన్‌కౌంటర్‌లో కాల్చేసినప్పుడు ఆమె ప్రజాస్వామిక ఉద్యమంలో నిర్వహించిన ప్రముఖ పాత్ర కారణంగానూ ఆమెపట్ల స్థానిక ప్రజలకు వుండిన విశేష ఆదరాభిమానాల కారణంగానూ మనం కూడ స్పందించి మూడున్నర సంవత్సరాల తరువాత మొట్టమొదటిసారి ఒక 'ఎన్‌కౌంటర్' ఘటనమీద నిజనిర్ధారణ కమిటీ వేసాము. ఆ తరువాత హైదరాబాద్‌లో బహిరంగసభ కూడ నిర్వహించాము. ఈ కార్యక్రమం విజయవంతంగా నడిచింది. ఈ రకమయిన స్పందన మనం ఇతర ఎన్‌కౌంటర్ ఘటనలపట్ల చూపకపోవడానికి పూర్తిగా పరిస్థితులే కారణంకాదు. మనలో చొరవ లోపించడం కూడ దానికి కారణమే. భవిష్యత్తులో ఈ లోటును సవరించుకోవలసిన అవసరం చాలా వుంది.

'ఎన్‌కౌంటర్ల' మీద మనం సుప్రీంకోర్టులో రెండుసార్లు పిటిషన్లు వేసాము. మొదటిసారి 1981లో, రెండవసారి 1985లో. రెండవ పిటిషన్ త్వరలోనే తేలిపోయింది. స్థానిక మేజిస్ట్రేటు కోర్టులలో ప్రైవేట్ కంప్లెయింట్లు వేసుకోండని సలహా ఇచ్చింది సుప్రీంకోర్టు. మొదటి పిటిషన్ మీద 8 ఏళ్ళ తరువాత రెండు నెలల క్రితం తీర్పు వచ్చింది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో జరిగిన ఎన్‌కౌంటర్లమీద విభిన్న వ్యక్తులు 1978-81 మధ్యలో వేసిన 3 పిటిషన్లకు సుప్రీంకోర్టు కలిపి తీర్పుచెప్తూ, పిటిషనర్లు తమ ఫిర్యాదును ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించుకోవలసిందనీ దానిపైన ఎటువంటి చర్య తీసుకునేదీ తనకు రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల కాలంలో తెలియజేయాలనీ సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం రాజకీయ కార్యకర్తలను హత్య చేస్తోందని సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తే, తిరిగి ఆ రాష్ట్ర ప్రభుత్వాలకే నివేదించుకొని చర్య తీసుకొమ్మని కోరుకొమ్మనడం నిరర్థకమైన తీర్పు అయినప్పటికీ ఆ తీర్పును అనుసరించి నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించి ఒక కాపీ కోర్టుకు పంపడమే సబబుగావుంటుంది. 1980నుండి ఇప్పటిదాకాజరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల జాబితాను తయారుచేసి త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తాము. అదే జాబితాను ఇప్పుడు తెలుగులో ఒక పుస్తకంగా అచ్చువేసాము.

## 2. ప్రజా ఉద్యమాలపైన నిర్బంధం :

రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపైన, ప్రజాస్వామిక కార్యకలాపాలపైన, తీవ్ర నిర్బంధం వుంది. ఊరేగింపులు, బహిరంగ సభలు, వీధి నాటకం ప్రదర్శనలు, తదితర రూపాలేకాక, కర

పత్రాలు పంచడం, పోస్టర్లు అంటించడం కూడ నిత్య నిర్బంధానికి లోబడి జరగవలసిందే. కార్మిక కర్షక విద్యార్థి సంఘాలకేకాక పౌరహక్కుల సంఘానికి కూడ ఊరేగింపులకూ బహిరంగ స్థలాలలో సభలకూ అనుమతి దొరకడం అసాధ్యం అయింది. గత రెండేళ్ళలో హైదరాబాద్‌లోనూ ఇతర పట్టణాలలోనూ అనేక సందర్భాలలో ఊరేగింపుల కోసం అనుమతి పొందాలని ప్రయత్నించాము కాని విఫలం అయ్యాము. 59వ రాజ్యాంగ సవరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో 1988 జూన్ 26వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికీ, పరువునష్టం బిల్లుకు వ్యతిరేకంగా పలు సంఘాలు కలిసి విశాఖపట్నంలో జరిపిన కార్యక్రమానికీ మాత్రం ఊరేగింపుకు అనుమతి దొరికింది. ఇక గ్రామీణ ప్రాంతాలలో లేక తాలూకా కేంద్రాలలో కార్యక్రమం చేపట్టే ప్రజా సంఘాలకు అనుమతి దొరకడం పూర్తిగా అసంభవం కావడమేకాక, అనుమతి కోసం పోలీసు స్టేషన్‌కు పోయిన వారిని అరెస్టుచేసి ఏదో కేసులో ఇరికించకపోతే అదే పదివేలు అనే పరిస్థితి ఏర్పడింది.

ఈ నిర్బంధాన్ని గురించి మనం ప్రత్యేకమయిన ఆందోళన కార్యక్రమాన్ని ఈ మధ్య కాలంలో చేపట్టలేదు. ఈ మహాసభలలో ఈ విషయాన్ని చర్చించుకొని ఏదయినా కార్యక్రమం ఆలోచించుకుంటే బాగుంటుంది.

## 3. లాకప్పు మరణాలు :

గత రెండేళ్ళలో మన రాష్ట్రంలో 46 లాకప్పు మరణాలు జరిగాయి. మనం ఒకటి రెండు మినహాయింపులతో అన్నిటి మీద నిజనిర్ధారణ కమిటీలువేసి నివేదికలు సేకరించాము. గత రెండేళ్ళలో మనం వేసిన 91 నిజనిర్ధారణ కమిటీలలో దాదాపు సగం లాకప్పు మరణాల మీదనే ఉండడం ఈ రంగంలో మనం చేస్తున్న కృషిని తెలుపుతుంది. నాలుగు సంఘటనల (వీరవాసరం, చీరాల, వెంకటాచల సత్రం, పుల్లల చెరువు) స్థానికంగా కరపత్రాలు పంచి బహిరంగ సభలు జరిపాము. మరొక నాలుగు సంఘటనల (రావులపాలెం, తణుకు, నరసింగరాయునిపేట, విజయవాడ) గురించి స్థానికంగా కరపత్రాలు వేసి పంచాము. లాకప్పు మరణాల గురించి పత్రికా ప్రకటనలు ఇవ్వడంతో ఆగిపోకుండ 'ఫాలో—అప్' కార్యక్రమాన్ని చేపట్టడం మంచి ఫలితాలను ఇస్తోంది. వీరవాసరం లాకప్పు మరణానికి నిరసనగా భీమవరంలోనూ పుల్లల చెరువు లాకప్పు మరణానికి నిరసనగా యెర్రగొండపాలెంలోనూ జరిగిన బహిరంగసభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మామూలుగా పౌరహక్కుల సభలకు రానివారుకూడ స్థానిక సమస్యమీద సభ జరిపేసరికి హాజరవుతారు. అయితే 46 లాకప్పు మరణాలలో కేవలం 8 సంఘటనల విషయంలో మాత్రమే మనం follow up చేయగలగడం కొంత ఆలోచించవలసిన విషయం. కొంచెం చొరవ తీసుకుంటే ప్రతీ లాకప్పు మరణం గురించీ మనం ఈ రకమయిన కార్యక్రమం చేపట్టగలము. కనీసం ఒక కరపత్రం ముద్రించి స్థానికంగా విస్తృతంగా పంచడం సాధ్యమవుతుంది.

1986 సెప్టెంబర్ నుండీ మన రాష్ట్ర ప్రభుత్వం అన్ని లాకప్పు మరణాల మీద న్యాయవిచారణ జరిపిస్తామని ప్రమాణం చేస్తూవున్నది. నిజానికి ఇప్పటి వరకు మనకు సమాచారం ఉన్నంత మేరకు 12 కేసులలో మట్టుకు న్యాయవిచారణ జరిగాయి. అందులో 5 ఈ రెండేళ్ళలో జరిగాయి. మనం ఈ అయిదింటిలో రెండింటిలో మట్టుకే (వీరవాసరం, శృంగవరపుకోట)పాల్గొన్నాము. వీరవాసరం న్యాయవిచారణలో కృష్ణాజిల్లా కార్యకర్తలు చొరవ తీసుకొని పాల్గొనగా, శృంగవరపుకోట న్యాయవిచారణలో విజయనగరం విశాఖపట్నం జిల్లాశాఖల కార్యకర్తలు కలిసి పనిచేసారు. భవిష్యత్తులో న్యాయవిచారణలో పాల్గొనడం అనేది ఒక తప్పనిసరి కర్తవ్యంగా పెట్టుకోవాలి. న్యాయవిచారణ నివేదికలను ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే పౌరహక్కుల అవగాహన ప్రచారంలో ఒక కర్తవ్యంగా దీనిని భావించాలి. మనం పాల్గొనడంవల్ల ఆ న్యాయవిచారణ సంగతి ఎట్లాగున్నా ఇతర ప్రయోజనాలుంటాయి. ఉదాహరణకు మాచర్ల దాసరి వెంకటేశ్వర్లు లాకప్ మరణం కేసులో గుంటూరు జిల్లాశాఖ చేసిన కృషి ఫలితంగా ఆ న్యాయవిచారణ నిర్వహించిన జడ్జి (శ్రీ రంగారెడ్డి) పౌరహక్కుల ఉద్యమంపట్ల అభిమానం పెంచుకున్నారు. ఆయన స్వస్థలమైన ప్రొద్దుటూరులో కడపజిల్లాశాఖ నిర్వహించిన బహిరంగసభలో మనం అడగగానే ఆయన వచ్చి మాట్లాడారు.

లాకప్పు మరణాలను వ్యతిరేకించేటప్పుడు మనం రెండు విషయాలను స్పష్టం చేస్తున్నాం. ఒకటి, నేరం ఎంత తీవ్రమయినదైనా దానిని విచారించే క్రమంలో బలప్రయోగం చేయడానికి వీలులేదు. చట్టంగూడ అందుకు ఒప్పుకోదు. రెండవది, అసలు నిజంగా సమాజానికి హానికలిగించే పెద్ద నేరస్తులను పోలీసులు ఏమీ అనరు గానీ చిల్లర నేరాలలో చిక్కుకున్న వారిని మట్టుకు చిత్రహింసలకు గురిచేసి చంపుతుంటారు. ఈ వాస్తవాన్ని సిద్ధాంతపరంగా కాక గణాంకాలతో నిరూపించడానికి కావలసిన అనుభవం ఎ. పి. సి. ఎల్. సి.కి వుంది. ఆ వివరాలను ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఒక బుక్‌లెట్‌గా ప్రచురించాము. పోలీసు లాకప్పులలో చనిపోయేది అత్యధికంగా దొంగతనం, తాగుడు, అల్లరి, కొట్లాట తదితర చిన్న నేరాలలో ఇరుక్కున్న వారేననీ, వాళ్ళు ఎక్కువగా కార్మిక రైతాంగ కుటుంబాల వారనీ సవివరంగా ఈ బుక్‌లెట్‌లో విశదీకరించాము.

## 4. దళితులపైన అత్యాచారాలు :

దళితులమీద జరుగుతున్న అత్యాచారాలను గురించి రాష్ట్రంలో ఆందోళన ఎంత జరుగుతూవుందో అత్యాచారాలూ అంతగా జరుగుతున్నాయి. గుంటూరుజిల్లా నీరుకొండ, విజయనగరంజిల్లా గుడియాడ, నెల్లూరుజిల్లా దొంతలి, చిత్తూరుజిల్లా బండ్లపల్లి, గుంటూరుజిల్లా కొల్లిపర, ప్రకాశంజిల్లా టంగుటూరు, రంగారెడ్డిజిల్లా జబ్బార్‌గూడెంలలో అగ్రవర్ణాల పెత్తందార్లు దళితులపైన జరిపిన హత్యాకాండలు ఈ రెండేళ్ళలోనే జరిగాయి. ఒక్క కొల్లిపర మినహాయించి తక్కిన అన్ని సంఘటనల మీదా మనం నిజనిర్ధారణ కమిటీ వేసాం. నీరుకొండ మారణకాండకు నిరసన తెలుపుతూ గుంటూరులోనూ దొంతలి మారణకాండకు నిరసన తెలుపుతూ నెల్లూరులోనూ బహిరంగ సభలు జరిపాము. టంగుటూరు ఇందిర హత్యకేసులో ఇతర ప్రజాస్వామిక సంఘాలతో కలిసి పనిచేసాము. టంగుటూరు గ్రామంలో కొన్ని వేల

మంది జనం పాల్గొన్న ప్రదర్శనలోనూ ఎ. పి. సి. ఎల్. సి. బాధ్యులు ప్రసంగించారు. ఇందిర హంతకులను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో ఒక పోరాట కమిటీ ప్రస్తుతం ఏర్పడింది. ఆ కమిటీతో కలిసి పనిచేసాము.

పైన పేర్కొన్న ఏ ఒక్క కేసులోనూ ఇప్పటిదాకా కోర్టులో విచారణ ప్రారంభంకాలేదు. అంతేకాదు, నాలుగేళ్ళ క్రితం జరిగిన కారంచేడు హత్యాకాండ మీద విచారణ కూడ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అయితే ఇంతగా పేరు పడని మరి కొన్ని సంఘటనలు వున్నాయి. కృష్ణాజిల్లా నందిగామ దగ్గరున్న కొడవటికల్లు, కంచిక చర్ల దగ్గరున్న గోకరాజుపల్లి గ్రామాలలో కూడా అగ్రవర్ణానికి చెందిన భూస్వాములు కూలీలను చంపారు. ఇందులో మొదటి కేసులో ఎ. పి. సి. ఎల్. సి. కృష్ణాజిల్లాశాఖ ఒత్తిడిమీద దోషులను అరెస్టు చేయడం జరిగింది. హత్య రుజువు కాలేదుగానీ కొడవటికల్లుకు చెందిన భూస్వామికీ అతని కుమారునికీ 3 సం॥ల శిక్ష పడింది.

ఈ రకమైన హత్యాకాండేకాక, నిత్యం గ్రామీణ ప్రాంతాలలో దళితులు అనేక రూపాలలో అణచివేతకు కుల వివక్షకూ గురి అవుతుంటారు. అంటరానితనాన్ని రాజ్యాంగంలోని అధికరణం 17లో నిషేధించినా అది అనేక రూపాలలో కొనసాగుతూనే వుంది. దళితులలో తమ హక్కుల గురించి చైతన్యం కలిగించే కర్తవ్యం పౌరహక్కుల పరిధిలోనిదే. చిత్తూరుజిల్లా శాఖ ఈ విషయంలో చెప్పుకోదగ్గ కృషి చేస్తోంది. అంటరానితనం పాటించే గ్రామాలలోనే కరపత్రాలు బహిరంగసభల రూపంలో చిత్తూరుజిల్లాశాఖ కార్యకర్తలు ప్రచార కార్యక్రమం చేపట్టారు.

రాష్ట్రంలో గత కొద్ది సంవత్సరాలగా దళిత ఉద్యమం బలపడుతోంది. దళితుల హక్కుల గురించి చైతన్యం కలిగించడానికి మనం వివిధ దళిత సంఘాలతో సమస్యల మీద కలిసి పని చేస్తున్నాం. మనం అగ్రవర్ణ ఆధిక్యతనూ దళితులపైన అణచివేతనూ వ్యతిరేకించడం అనే కనీస పౌరహక్కుల అవగాహనకే కట్టుబడి పనిచేసినప్పటికీ ఐక్యకార్యాచరణవల్ల బాగా ఫలితం వుంటుంది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో (ముఖ్యంగా చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, ప॥గోదావరి) మనకు స్థానిక దళిత ఉద్యమాలతో సత్సంబంధాలువున్నాయి. ఆ సంబంధాలను మరింత పెంపొందించడం అవసరం. ఎ. పి. సి. ఎల్. సి. బాధ్యులుగావున్న న్యాయవాదుల దగ్గరికి అన్యాయానికి గురయిన దళితులు సహాయం కోరుతూ రావడం అనేది తరచుగా జరుగుతూ వుంది. సంస్థలో న్యాయవాదుల సంఖ్యను మరింత పెంచుకోవడం ద్వారా ఈ రంగంలో మనం చాలా సహాయంగూడ చేయగలుగుతాం.

గిరిజనులపైన గిరిజనేతరుల దాడులను కూడ ఈ దృష్టితోనే మనం వ్యతిరేకిస్తున్నాము. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం 'రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970'ని ఉపసంహరించాలని నిర్ణయించడాన్ని మనం వ్యతిరేకించాము. తరతరాలుగా గిరిజనుల భూములను గిరిజనేతరులు కాజేయడం జరుగుతూవుంది. ప్రభుత్వాలు గిరిజనేతరులకు మద్దతు ఇస్తూ వచ్చాయి. ఈ దురాక్రమణకు వ్యతిరేకంగా గిరిజనులు అనేక పోరాటాలు చేశారు. వాటి ఫలితంగా ప్రభుత్వం గిరిజనుల భూములను దురాక్రమణల నుండి కాపాడటం కోసమని చెప్పి చట్టాలు చేసింది. అయితే వాటిని అమలు మట్టుకు చేయడం లేదు. చేయకపోగా, అడవుల పారిశ్రామికీకరణ పేరిట గిరిజనులకు అడవుల మీద హక్కులు లేకుండ చేస్తోంది. ఈ వరవడిని మనం వ్యతిరేకిస్తూ ప్రచారం కొనసాగించాలి.

## ౫. స్త్రీలపై అత్యాచారాలు :

స్త్రీలపైన జరిగే అత్యాచారాలను పౌరహక్కుల ఉద్యమం చొరవ తీసుకొని పట్టించుకోవాలని గతంలో రాష్ట్ర కార్యవర్గం ఎన్నోసార్లు తీర్మానించినప్పటికీ ఆచరణ చాలా నిరాశాజనకంగా వుంది. లైంగిక అత్యాచారాలూ, వరకట్న హత్యలూ ప్రతిరోజూ రాష్ట్రం నలు మూలలా జరుగుతున్నాయి. పౌరహక్కుల పరిధిలో మనం చేయగల కృషి చాలా వుంది. 1986లో భారత శిక్షాస్మృతిని సవరించి సెక్షన్ 304–Bని చేర్చిన తరువాత కూడ వరకట్నం సంబంధమైన వేధింపు వుందని సమాచారం వున్నా పోలీసులు వరకట్నం మరణాలను 'అనుమానాస్పద మృతి' అనే పేరుతో CRPC సెక్షన్ 174 క్రింద మూసేస్తున్నారు. వాస్తవాలు వెలుగులోకి తీసుకొచ్చి ప్రచారంచేయడం కనీసం సెక్షన్ 304-B క్రింద కేసు నమోదయ్యేలాగ చూడడం, సరయిన విచారణ జరిగేటట్టు పోలీసు యంత్రాంగం మీద ఒత్తిడి తేవడం, మన కనీస కర్తవ్యాలు. అయితే మనం ఈ విషయంలో చాలా వరకు విఫలం అయ్యాము. గత రెండేళ్ళలో అన్ని జిల్లాలలోనూ కలిపి మనం 91 నిజనిర్ధారణ కమిటీలను వేశాము. అందులో కేవలం 3 మాత్రమే వరకట్నం హత్యలమీద వుండడం విచారించదగ్గ విషయం. వున్నంతలో కృష్ణాజిల్లా ఈ విషయంలో చొరవ చూపిస్తోంది కానీ మొత్తంమీద ఇంకా చాలా ప్రయత్నం అవసరం. సంస్థలోకి మరికొంత మంది న్యాయవాదులను, ప్రత్యేకించి మహిళా న్యాయవాదులను, చేర్చుకోవడంవల్ల ఈ కోర్టు సంబంధమయిన సహాయం మరింత చేయగలుగుతాం.

కోర్టు సంబంధమైన కృషేకాక, స్త్రీలపైన జరిగే అణచివేతను గురించి ప్రచార కార్యక్రమం చేపట్టడమూ అవసరమే. హైదరాబాద్‌శాఖ 1988 జూలై 11వ తేదీన ఈ విషయం మీద సదస్సు నిర్వహించింది. విశాఖపట్నంజిల్లాశాఖ స్త్రీల హక్కులు చట్టం అనే అంశంమీద అధ్యయన తరగతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారుగానీ అది అమలు అయినట్టులేదు. అయితే దేవరాలా 'సతి' సంఘటన మీద ఒక్క విశాఖపట్నంజిల్లాశాఖ మట్టుకే నిరసన సభ నిర్వహించింది.

## 6. నల్ల చట్టాలు :

59వ రాజ్యాంగ సవరణ చట్టం, కొత్తగా సవరించి జారీ చేసిన టెర్రరిస్టు చట్టం (1987), కార్మిక సంఘాల బిల్లు, ఆస్పత్రులు, ఇతర సంస్థల బిల్లు, పరువునష్టం బిల్లు, ఈ రెండేళ్ళలో రూపొందిన ప్రధానమయిన అప్రజాస్వామిక శాసనాలు. మనం వీటన్నింటికీ వ్యతిరేకంగానూ మన పరిమితులలో అలజడి చేశాము. పరువునష్టం బిల్లు మీద హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, ఖమ్మం, విశాఖపట్టణం, అనంతపురం, నిజామాబాద్‌లలో సభలు జరిపాము. వివిధ దినపత్రికల సంపాదకులు, స్థానిక

పత్రికా విలేఖరులు మన సభలలో మాట్లాడారు. 59వ రాజ్యాంగ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విజయవాడ, హైదరాబాద్, ఖమ్మం, నెల్లూరు, తిరుపతి, నిజామాబాద్, అనంతపురంలలో బహిరంగ సభలు జరపడమే కాక వివిధ ప్రజాస్వామిక సంస్థలతో కలిసి రాష్ట్రస్థాయిలోనూ కొన్ని జిల్లాలలోనూ కమిటీలు ఏర్పాటు చేసి చాలాచోట్ల సభలూ సదస్సులూ నిర్వహించాము. ఆ సందర్భంలో హైదరాబాద్‌లో గత సంవత్సరం జూన్ 26వ తేదీన నిర్వహించిన ఊరేగింపు చాలాకాలం తరువాత మన రాష్ట్రంలో జరిగిన మొదటి పౌరహక్కుల ఊరేగింపు. ఒక్క టెర్రరిస్టు చట్టాన్ని గురించి ప్రత్యేకంగా సభలూ సమావేశాలూ 1985నుండి జరుపుతూనే వున్నాము. అంతేకాక వివిధ సందర్భాలలో ఆ చట్టాన్ని గురించీ, అందులోని అప్ర స్వామిక లక్షణాలను గురించీ వివరిస్తూ ప్రచారం చేసాము. కార్మిక సంఘాల బిల్లు, ఆస్పత్రులు ఇతర సంస్థల బిల్లును గురించి కార్యక్రమాలు రూపొందించుకున్నాము గానీ ఒక్క అనంతపురంలో తప్ప వేరే ఎక్కడా ఆ విషయంలో పెద్దగా చొరవ తీసుకోలేదు.

టెర్రరిస్టు చట్టాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం చాలా విరివిగా వినియోగిస్తోంది. మన రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలలో ఎంతలేదన్నా కనీసం 1200 మంది టెర్రరిస్టు చట్టం క్రింద అరెస్టయి వుంటారు. వీళ్ళందరూ ఎటువంటి సహజ న్యాయ సూత్రాలకూ తావులేని విచారణ పద్ధతిలో విచారింపబడతారు. ఇప్పటికే చాలా కేసులలో విచారణ పూర్తి అయిపోయి ముద్దాయిలకు అతి స్వల్పమైన సాక్ష్యాలమీద కఠిన కారాగార శిక్ష వేయడం జరిగింది.

ఈ రాజకీయ ఖైదీల హక్కుల సంరక్షణ మనరాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమం మీద వున్న గురుతరమైన బాధ్యత. ఇప్పటిదాకా మనం టెర్రరిస్టు చట్టంలోని అప్రజాస్వామిక లక్షణాలను ఎండగట్టడం మట్టుకే చేశాము. బెయిల్ నుండి నేర విచారణ దాకా అన్ని దశలలోనూ వారికి అవసరం అయిన న్యాయ సహాయాన్ని అందేటట్టు చూడవలసిన బాధ్యత పౌరహక్కుల ఉద్యమం మీద వుంది. ప్రస్తుతం కోర్టులు యధాలాపంగా ఏర్పాటు చేస్తున్న న్యాయ సహాయం మాత్రమే వాళ్ళకు అందుతోంది. సమర్థవంతమైన న్యాయసహాయం లేక రాజకీయ ఖైదీలు చాలా నష్టపోతున్నారు. అయితే ఇక్కడి కోర్టులలో శిక్షపడినవారికి సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోడానికి అవసరమయిన సహాయం మట్టుకు ఏర్పాటు చేయగలిగాము. టెర్రరిస్టు కేసు అప్పీల్ ఏదయినా సరే మొత్తం ఖర్చులన్నీ కలుపుకొని 2000 రూపాయలయినా అంతకంటే తక్కువే ఇచ్చినా చేయడానికి ఇద్దరు ముగ్గురు లాయర్లు ఒప్పుకున్నారు. కేసులు చేస్తున్నారు. మొట్టమొదటి అప్పీల్ విజయవంతమయి, పోచమ్మ అనే ఖైదీని (ఖమ్మం జిల్లా) సుప్రీంకోర్టు విడుదల చేసింది.

## 7. కాలుష్యం తదితర సమస్యలు :

ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యక్షంగా చేసే బలప్రయోగమే కాక, ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల వైఫల్యంవల్ల ప్రజావ్యతిరేక ఆర్థిక విధానంవల్ల, ప్రజల హక్కులకు భంగం కలిగినా దానినీ పౌరహక్కుల సమస్యగానే భావిస్తున్నాము. పైగా ఈ రకమయిన సమస్యలపైన రాజకీయ పార్టీలు పెద్దగా అలజడి చేయవు కాబట్టి వీటిపైన మనం పనిచేయవలసిన అవసరమూ చాలా వుంది. పారిశ్రామిక కాలుష్యం ఈ కోవకు చెందిన ముఖ్యమైన సమస్య. హైదరాబాద్, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల శాఖలు ఈ సమస్య మీద కొంత పనిచేస్తున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నం పరిసరాలలోని పారిశ్రామిక కేంద్రాలవద్ద నివసించే కాలుష్య బాధిత ప్రజానీకం దృష్టిలో పౌరహక్కుల సంఘానికి కాలుష్యం గురించి అలజడిచేసే సంఘంగా కొంత గుర్తింపు వచ్చింది. ఆ గ్రామాలలో మనం నిర్వహించిన సమావేశాలకు స్థానిక జనం బాగా హాజరయ్యారు. ఇప్పటివరకు మనం కాలుష్యానికి సంబంధించిన వాస్తవాలను పత్రికలద్వారా ప్రచారం చేయడం, కాలుష్య నివారణ చట్టాలను తత్సంబంధమైన యంత్రాంగం బాధ్యతలనూ ఆ బాధ్యతలు నిర్వర్తించడంలో వున్న వైఫల్యాన్ని, ప్రజలకు తెలియజేస్తున్నాము. అయితే ఇంకొంచెం ముందుకు పోయి నష్టపరిహారానికి స్థానిక కోర్టులో సివిల్ దావాలూ కాలుష్య నివారణకు హైకోర్టులో రిట్ పిటిషన్లు వేసే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. విశాఖపట్నం జిల్లాశాఖ ఇప్పటికే ఈ ప్రయత్నంలో వుంది. కోర్టులో కేసులవల్ల అంతిమంగా ఫలితం వచ్చినా రాకున్నా ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికీ సమస్య లోతుపాతులు తెలుసుకోవడానికీ అవి వుపయోగపడతాయి. అంతే కాకుండా, కోర్టుల వల్ల ఏ ఫలితమూ ఉండదని వదిలేయకుండా, పౌరహక్కుల పరిరక్షణచేసే బాధ్యత కోర్టులమీదవుందని వత్తిడిచేయడం చాలా అవసరం.

అణుకాలుష్యం ప్రాణానికీ రాబోయేతరాల ఆరోగ్యానికీ హానికరం కాబట్టి అది అన్నిరకాల కాలుష్యంకంటే ప్రమాదకరమైనది. రాష్ట్రప్రభుత్వం నాగార్జునసాగర్ రిజర్వాయర్‌వద్ద అణువిద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పాలన్న ప్రతిపాదన చేసినప్పుడు మనం బలంగా స్పందించాము. హైదరాబాద్‌కు చెందిన Citizən's Against Pollution అనే సంస్థను కలుపుకొని విజయవాడలోనూ గుంటూరులోసూ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా సభలు నిర్వహించాము. విశాఖపట్నంలోనూ విజయనగరంలోనూ ఎ పి సిల్ సి ఆధ్వర్యంలో సభలు నిర్వహించాము. అణుకాలుష్యం స్వభావాన్ని వివరించే వీడియో క్యాసెట్లను బొంబాయినుండితెచ్చి హైదరాబాద్‌లో, విజయనగరంలో, కావలిలో తిరుపతిలో ప్రదర్శించాము. ఇతర ప్రజాస్వామిక సంస్థలతోకలిసి సాగర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక కమిటీ ఏర్పాటుచేసి నాగర్జునసాగర్‌వద్దనూ హైదరాబాద్‌లోనూ, గుంటూరులోను కార్యక్రమాలు నిర్వహించాము. ప్రభుత్వం ప్రస్తుతం అణువిద్యుత్ కేంద్రాన్ని నాగర్జునసాగర్‌వద్ద నెలకొల్పే ప్రతిపాదనను ఉపసంహరించుకొని కృష్ణాజిల్లా తీరప్రాంతంలోనూ శ్రీకాకుళంజిల్లా తీరప్రాంతంలోనూ అనువయిన ప్రత్యామ్నాయ స్థలంకోసం అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది. కృష్ణాజిల్లాశాఖ, శ్రీకాకుళంశాఖ, ఇప్పటికీ అణుకాలుష్య ప్రమాదాన్ని వివరిస్తూ కొంత ప్రచారం చేసివున్నాయి. ఈ ఉద్యమాన్ని మనం ఇంకా ముందుకు తీసుకుపోవలసి వుంది.

కాలుష్యంసమస్య కోవకు చెందినదే చిత్తూరుజిల్లా ఏనుగుల సమస్య. ప్రభుత్వం అనుసరించే అప్రజాస్వామిక అటవీవిధానం ఫలితంగా నిలువనీడ కోల్పోయిన అడవి జంతువులు గ్రామాలమీద

పడుతుంటాయి. చిత్తూరుజిల్లా దక్షిణ ప్రాంతంలోవున్న అడవిలోకి గత నాలుగేళ్ళగా కర్నాటక తమిళనాడు రాష్ట్రాలనుండి వలస వచ్చిన ఏనుగులు ప్రవేశించాయి. ఆరు మండలాలోని వంద గ్రామాలలో ఈ ఏనుగులు చాలా భీభత్సం చేస్తున్నాయి. 30 మందిని తొక్కి చంపి దాదాపు 1కోటి రూపాయల విలువచేసే పంటను ధ్వంసం చేసాయి. ప్రజల జీవనానికి కనీసభద్రత కల్పించే బాధ్యత గల ప్రభుత్వం ఈ సమస్యను పూర్తిగా ఉపేక్షించిన సందర్భంలో మన చిత్తూరుజిల్లాశాఖ ఏనుగుల సమస్యపైన అలజడిని ఒక ముఖ్యకార్యక్రమంగా చేపట్టింది. ఏనుగుల సమస్యను సత్వరంగా పరిష్కరించమని ప్రభుత్వానికి ఆదేశం ఇయ్యవలసిందిగా కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాము. దానికోసం 6 మండలాలలో దాదాపు 70 గ్రామాలు తిరిగి 850 మంది రైతులవద్దనుండి పంట నష్టానికి సంబంధించిన ప్రమాణపత్రాలు సేకరించాము. ఇది పోలీసులతో ఏ రకమయిన ప్రమేయములేని సమస్య అయినా జిల్లా పోలీసుయంత్రాంగం రంగంలోకి దిగి పౌరహక్కులసంఘం నక్సలైట్ల సంస్థఅనీ వాళ్ళను గ్రామాలలోనికి రానీయవద్దనీ ప్రచారం చేసింది. ఆ ప్రచారాన్ని మనం తిప్పికొట్టి అదేగ్రామాలలో మళ్ళీ తిరిగి ప్రచారం నిర్వహించగలిగాము. ప్రస్తుతం, ఆ ప్రాంతపు రైతులు తమస్వంత చైతన్యంతో తమ సమస్య పరిష్కారంకోసం పోరాట కమిటీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహంఇచ్చే ప్రయత్నంలో ఉన్నారు. వాళ్ళకు ఆ చైతన్యం ఇవ్వగలిగితే పౌరహక్కుల సంఘంగా మన కర్తవ్యం మనం నిర్వహించినట్టే, హైకోర్టులో ఉపయోగకరమయిన ఆర్డర్ సాధించగలిగితే మరీ మంచిది.

## 8. ఎ.పి.సి.ఎల్.సి. పైన దాడులు :

గత రాష్ట్రమహాసభలకు పూర్వం, ముఖ్యంగా 1985-85 సంవత్సరాలలో, మనం తీవ్రమయిన నిర్బంధాన్ని ఎదుర్కొన్నాం. ఆ రెండేళ్ళలోనే గోపిరాజనన్నూ డాక్టర్ రామనాధంనూ జాపా లక్ష్మరెడ్డినీ పోగొట్టుకున్నాం. రాష్ట్రకార్యవర్గంలో దాదాపు సగం మందిని ఆ రెండేళ్ళలో తీవ్రమయిన నేరారోపణలతో అరెస్టు చేసారు. అప్పుడు పెట్టిన కేసులలో కొన్ని చార్జిషీటుకు సహితం నోచుకోకపోగా, కాకినాడలో ఎపి.సి.ఎల్.సి. రాష్ట్రసహాయ కార్యదర్శి సుబ్రహ్మణ్యంమీద, అప్పటి తు గో.జిల్లా కన్వీనర్ గురునాధంమీద పెట్టిన రాజద్రోహంకేసు ఇప్పుడు విచారణకు వచ్చింది.

1987 తరువాత దాడులు కొంతతగ్గినప్పటికీ ఇంకా కొనసాగుతూనే వున్నాయి. 1987 అక్టోబర్ నెలలో హైదరాబాద్లో కన్నబిరాన్గారి ఇంట్లో సమావేశం అయిన రాష్ట్రకార్యవర్గం మీద మఫ్టీ పోలీసులూ గుండాలూ దాడిచేసి కర్రలతో గొలుసులతో కొట్టారు. అదే సంవత్సరం డిసెంబర్ నెలలో హైదరాబాద్లోని ఇందిరాపార్క్లో సమావేశం అయిన జంటనగరాల కార్యకర్తల మీద మఫ్టీపోలీసులూ గుండాలూ దాడిచేసి అసభ్యంగా దూషించారు, కొట్టారు. జంటనగరాలశాఖ కారకర్త అయిన సత్యంను స్పెషల్ టాస్క్ఫోర్స్ పోలీసులు క్రిందటి సంవత్సరం అరెస్టుచేసి దబీర్ పురా పోలీసుస్టేషన్లో అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసారు. ఖమ్మంజిల్లాశాఖ సహాయ కార్యదర్శి అయిన రవికుమార్ ను 7రోజులు అక్రమ నిర్బంధంలోవుంచి, చిత్రహింసలకు గురిచేసి హత్యాప్రయత్నం కేసుపెట్టారు. ఖమ్మంజిల్లా కార్యవర్గ సభ్యుడయిన సత్యనారయణరెడ్డిగారిని కూడా ఖమ్మంజిల్లా పోలీసులు నిర్బధించి కొట్టారు.

ఖమ్మంజిల్లా కేశవపురం గ్రామంలో పోలీసు అత్యాచారాల గురించి వాస్తవసేకరణ చేయడానికి 1988 నవంబర్ 7వ తేదిన వెళ్ళిన నిజనిర్ధారణ కమిటీని పోలీసులు నిర్బధించి దూషించారు. గుంటూరుజిల్లా కందేరులో ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో దళితులపైన జరిగిన దాడిని గురించి విషయసేకరణ చేయడానికివెళ్ళిన నిజనిర్ధాణ కమిటీని ఆ గ్రామభూస్వాములు ఆటంకపరిచి బెదిరించారు.

రాష్ట్రసహాయకార్యదర్శి సుబ్రహ్మణ్యం నాగర్జున విశ్వవిద్యాలయం NMR సిబ్బంది సంఘం గౌరవ అధ్యక్షునిహోదాలో, సిబ్బంది రెగ్యులైజేషన్లోవున్న కులపక్షపాత వైఖరిని ప్రశ్నించినందుకు అతనిని ఆ విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక కౌన్సిల్ ఉద్యోగంనుండి సస్పెండ్ చేసింది. సస్పెండ్చేసి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ చార్జిషీటు ఇవ్వడంగానీ విచారణ నిర్వహించడం గానీ జరగలేదు.

చివరిగా మన అధ్యక్షులు కన్నబిరాన్గారు వచ్చేవారంలో బ్యాంగ్కాక్లో ఒక మానవ హక్కుల సదస్సుకు హాజరుకావలసి ఉండగా ప్రభుత్వం ఆయనను పోనివ్వకుండ చేయడానికి మీ పాస్ పోర్టుకు విదేశాంగమంత్రి నుండి క్లియరెన్స్ కావాలి అని చివరి నిముషంలో ఆటంకపరిచింది.

పౌరహక్కుల ఉద్యమంమీద జరుగుతున్న దాడులగురించి మనం కొంతశక్తివంతంగానే ప్రచారం చేయగలిగాం. దానికి ఇతర రాజకీయ కారణాలుకూడ తోడయి. ఈ మధ్యకాలంలో మన మీద దాడులు కొంత తక్కువస్థాయిలో వున్నాయి. మనం మన నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకోవడంద్వారా ఈ పరిస్థితిని ఇంకొంత మెరుగు పరుచుకోగలుగుతాం.

## 9. సంస్థ నిర్మాణం, స్థితిగతులు :

గత రెండేళ్ళలో సంస్థ నిర్మాణాన్ని కొంతవరకు మనం పెంచుకోగలిగాము. కొన్ని ఏళ్ళుగా విశాఖజిల్లా పౌరహక్కుల సంఘంగా వున్నది. 1987 అక్టోబర్ 10వ తేదిన ఎ.పి.సి.ఎల్.సి విశాఖపట్నం జిల్లాశాఖగా విలీనం అయింది. అంతకు ముందున్న అధ్యక్షులు దిగుమర్తి గోపాలస్వామిగారి స్థానంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ భాగంలో అధ్యాపకులయిన డా॥ సూరప్పడు గారిని, మళ్ళీ ఎన్నికలు జరిగేంతవరకు అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. త్వరలోనే మళ్ళీజిల్లా సర్వసభ్య సమావేశం జరిపి ఎన్నికలు నిర్వహించవలసి వుంది.

1987 అక్టోబరు 11వ తేదిన శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల సంయుక్త శాఖను ఏర్పాటు చేసాము. విజయనగరం, శృంగవరపుకోట, పార్వతీపురం, పెక్కలి, హరిపురం ప్రాంతాల నుండి 30మంది సభ్యులు చేరారు. అయితే రెండుజిల్లాల విస్తీర్ణం కారణంగా సంయుక్తశాఖ ఆచరణలో శ్రీకాకుళంజిల్లా శాఖగానే పని చేస్తున్న కారణంగా ఒక సంవత్సరం తరువాత 1988 నవంబర్

1వ తేదిన, శ్రీకాకుళం జిల్లాశాఖను విడిగా ఏర్పాటు చేయడం జరిగింది. మార్పు సీతారామయ్యగారిని అధ్యక్షులుగానూ వారణాసి నారాయణరావుగారిని ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నుకోవడం జరిగింది. డిసెంబర్ 3వ తేదిన విజయనగరప్రాంతం కార్యకర్తలు సమావేశంఅయి శ్రీ. ఆర్. మజుందార్‌ను కన్వీనర్‌గా ఎన్నుకొని విజయనగరం జిల్లాశాఖను ఏర్పాటు చేసుకున్నారు.

1988 డిసెంబర్ 10వ తేదిన కడపజిల్లాశాఖ ఏర్పడింది. జిల్లానలుమూలలోనుండి వచ్చిన కార్యకర్తలు ప్రొద్దుటూరుకు చెందిన అడ్వకేట్ జయశ్రీగారిని అధ్యక్షులగానూ మైదుకూరుకు చెందిన ఎం. జె. సుబ్బరామిరెడ్డిని ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నుకున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఏర్పాటుకోసం ఈ సంవత్సరం జనవరి 26న మొదలుపెట్టి పాలకొల్లు, కొవ్వూరు, ఏలూరు, భీమవరంలో సమావేశాలు జరిపి ఏప్రిల్ 16వ తేదిన పశ్చిమగోదావరి జిల్లాశాఖను ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీ గద్దెరాంమూర్తి అధ్యక్షులగానూ పరకాల సుధాకర్‌ను ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకున్నారు.

రెండేళ్ళు కొంత స్తబ్దంగావున్న రంగారెడ్డిజిల్లా శాఖను మొన్నటి ఏప్రిల్ 23 వ తేదీన పునర్వ్యవస్థీకరించి వికారాబాద్‌లో సమావేశం జరిపి శ్రీ డి. నారాయణరెడ్డిని అధ్యక్షులగానూ శ్రీ వి. శంకరయ్యగారిని ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నుకున్నారు.

అయితే మరొకవైపు గతంలో ప్రారంభించిన కొన్నిశాఖలు పూర్తిగా స్తబ్దం అయిపోయాయి. మెదక్ మహబూబ్‌నగర్, కర్నూల్‌జిల్లా శాఖలు ఈ కోవకు చెందుతాయి. వీటిని పునరుద్ధరించ వలసిన కర్తవ్యం మన మీద వుంది. గుంటూరుజిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు రాజీనామా చేసిన తరువాత, ఆ జిల్లాశాఖ కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తూవున్నా నిర్మాణరీత్యా బలహీనపడింది. ప్రకాశం, అనంతపురం జిల్లాశాఖలు కార్యక్రమాలు నిర్వహిస్తూవున్నా నిర్మాణరీత్యా బలం పుంజుకోలేదు. డా॥ రామనాథం, జాపా లక్ష్మరెడ్డిగార్ల హత్యల ఫలితంగా పూర్తిగా స్తబ్దం అయిపోయిన వరంగల్ కరీంనగర్ జిల్లా శాఖలను పునరుద్ధరించే ప్రయత్నంకూడా చేయవలసి వుంది. పౌరహక్కుల సాధనకై ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం మన లక్ష్యం అని లక్ష్య ప్రకటనలో రాసుకున్నాం. ఇప్పట్లో అది ఒక ఆశయం మాత్రమే కాగలదు. అయితే మనం ప్రస్తుతం చేస్తున్న పరిమితమయిన పనికి కావలసిన నిర్మాణాన్ని తయారు చేసుకోవడం మనకు అందుబాట్లో వున్న విషయమే. ప్రతీ జిల్లాలోనూ రెగ్యులర్‌గా పౌరహక్కుల పనిలో నిమగ్నమయ్యే కార్యకర్తలు 10 లేక 15మందిని తయారు చేసుకొని, వాళ్ళు తరచుగా కలుసుకొని అభిప్రాయాలూ, అనుభవాలూ పంచుకొని కార్యక్రమాలు చేపట్టే నిర్మాణాన్ని తయారు చేసుకుంటే ప్రస్తుతం మనం చేస్తున్నపని మరింత సమర్థవంతంగా చేయగలుగుతాం. లాయర్లు జర్నలిస్టులు ఇతర మేధావి వర్గాలనుండి కార్యకర్తలనూ లేక కార్యక్రమాలలో కలిసి వచ్చే సానుభూతి పరులనూ తయారుచేసుకోవడమూ అవసరమే. వీటి మీద దృష్టి కేంద్రీకరించి నిర్మాణాన్ని అభివృద్ధి చేసుకోవడం అవసరం.

స్థానికంగా ప్రజలు ఎదుర్కొనే పౌరహక్కుల సమస్యల మీద పనిచేయడం నిర్మాణాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కొత్తగా కార్యకర్తలను తయారు చేసుకోవడానికీ బాగా పనికివస్తుంది. అంతే కాకుండా, పౌరహక్కుల అవగాహన కూడ సాధారణ స్థాయిలో జరిగే ప్రచారంకంటే నిర్దిష్ట స్థానిక సమస్యల ద్వారా వివరించినప్పుడే బాగా అర్థం అవుతుంది స్థానిక పౌరహక్కుల సమస్యలమీద కరపత్రాలు వేయడం, పోస్టర్లు వేయడం, సభలూ సమావేశాలూ నిర్వహించడం, తక్కువగా జరుగుతోంది. గత రెండేళ్ళలో మనం మొత్తం 67 బహిరంగసభలు సదస్సులూ జరిపాము. అందులో 10 మాత్రమే స్థానికసమస్యల మీద వుండడం ఈ వాస్తవాన్ని తెలియజేస్తుంది. దీనిని మరింత ఎక్కువ చేయడం అన్ని విధాలా అవసరం. లాకప్పు మరణాలు లేక దళితులపైన అత్యాచారాలు జరిగినప్పుడు అవి జరిగిన ప్రాంతంలోనే కరపత్రాలు పంచి బహిరంగ సభలు నిర్వహిస్తే జనం బాగా ఆదరణ చూపుతున్నారనేది మనకు అనుభవపూర్వకంగా తెలిసిన విషయం.

పౌరహక్కుల చైతన్యం ప్రచారం చేయడానికి మన మాసపత్రిక స్వేచ్ఛ ఒక ప్రధాన సాధనం. అయితే ఆర్థిక లోపంవల్ల మనం పత్రికను సకాలంలో తీసుకురాలేకపోతున్నాం. గత రెండేళ్ళలో 24 సంచికలు రావలసింది, 15 మాత్రమే తీసుకురాగలిగాము పత్రిక ప్రతీ నెలా రావాలంటే నెలకు కనీసం 2000 రూపాయలు నగదు చేతిలో వుండాలి. చందాలలోనూ విడిప్రతులు అమ్మకం ద్వారానూ నెలకు 2000 రూపాయలు సేకరించడం సాధ్యంకాదు. కాబట్టి 5 సంవత్సరాల చందాలు (100 రూ॥) కట్టించాలని నిర్ణయించాము. పాతబాకీ 40,000 తీర్చడానికీ భవిష్యత్తులో పత్రిక క్రమం తప్పకుండా రావడానికీ ఇది దోహదం చేస్తుంది. ఈ నిర్ణయాన్ని చురుగ్గా అమలు చేయవలసిన అవసరం ఉంది. అదే సమయంలో 'స్వేచ్ఛ'కు నెలసరి ఫండ్ సేకరించడంకూడా జరుగుతుంది. నెల్లూరు, విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్ శాఖల కార్యకర్తలూ కొందరు మేధావులూకలిసి నెలకు 600రు॥ల ఫండ్ సమకూరుస్తున్నారు. మరొక 400 రు॥ల ఫండ్ ప్రతీనెలా సమకూరేటట్టయితే 1000 రు॥ల తప్పని సరిగా చేతిలో వుంటాయి ఎవరయినా 8 మంది నెలకొక 50 రు॥ల చొప్పున ఇస్తామని కమిట్ అయితే ఈ అవసరం తీరుతుంది.

గత రెండేళ్ళలో మరొక చెప్పుకోదగ్గ పరిణామం, వీధి నాటకాన్ని ఒక బలమయిన ప్రచార రూపంగా అభివృద్ధి చేయడం. కృష్ణాజిల్లా కార్యకర్తలు తమ స్వంత చొరవతో ఈ రూపాన్ని అభివృద్ధి చేసారు. 59 వ రాజ్యాంగ సవరణ, అణువిద్యుత్తు, టెర్రరిస్టు చట్టం, పోలీసు అత్యాచారాలు తదితర అంశాలపైన వాళ్ళు తయారు చేసిన వీధి నాటకాలు విశేషంగా జనాదరణ పొందాయి. ఈ ప్రచార రూపాన్ని అన్ని జిల్లాశాఖలూ అలవర్చుకోవడం అవసరం.

పౌరహక్కుల పరిరక్షణ కోసం ఎపిసిఎల్‌సి గణనీయమయిన కృషి చేస్తోందని ఇటు ప్రజలు అటు ప్రభుత్వము భావిస్తున్నారు. గత రెండేళ్ళలో 91 నిజనిర్ధారణ కమిటీలు వేసాం. 67 సభలూ సమావేశాలూ నిర్వహించాము. 1988 ఫిబ్రవరి 13-14 తేదీలలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విభిన్న రంగాలలో

(మిగతా 13వ పేజీలో)

రొటీన్‌గా చేపట్టే పనులవలన కొద్దిమందికి మాత్రమే పని లభించింది.

ఈ పరిస్థితుల్లో గిరిజనులు కాయలూ, పండ్లూ దుంపలు తిని బతికారు. ఇప్ప పువ్వు ముఖ్యమైనఆహారం. ఇదికాక 'మాటి'గడ్డలు, 'సన్నెగడ్డలు' ఇతర గింజలు తింటారు. ఇందులో సన్నెగడ్డచాలా విషపూరితమైంది. విషంపోవాలంటే దీన్ని ఆరుసార్లు ఉడక బెట్టాలి. అయితే దట్టంగా అడవులున్న చోటే ఇవి దొరుకుతాయి మిగతా ప్రాంతాల్లో ఇప్పపువ్వు మాత్రం దొరుకుతుంది. మేనెలలో తునికాకు సేకరించగా వచ్చిన డబ్బుతో తిండిధాన్యం కొనుక్కోగలిగారు. ఇక జూన్ నెలలో ఏ పనులూలేవు. వర్షం పొలం పనులు మొదలవుతాయని ఎక్కడికీ తరలివెళ్ళ లేదు. అందుకే చాలామంది పస్తులుంటున్నారు.

ఇప్పుడు వానలు పడినా మరో నాలుగైదు నెలలు దాటితే గాని పంటచేతికి రాదు. కానీ అప్పటి వరకు బతకడమెట్లా? ఇప్పుడు వానలు పడినా దున్నటానికి ఎడ్లులేవు, విత్తనాలు లేవు. చాలా మంది 500-600 రూపాయలకు ఎడ్లను కిరాయికి తెచ్చుకొంటున్నారు. ఇవన్నీ ఆదివాసులదగ్గర తక్కువధరకు షావుకార్లు కొన్నవే. ఆరునెలల తర్వాత ఎడ్లు వాపసు ఇవ్వాలి. ఇంటిపై రేకులు అమ్మి విత్తనాలు కొన్న వాళ్ళున్నారు. కొందరు పశువులను ఏదోధరకు అమ్మి విత్తనాలు తెస్తున్నారు. ఎందుకంటే ఎడ్లను కిరాయికి తెచ్చుకోవచ్చు. కాని విత్తనాలు కొనటానికి అప్పు ఇచ్చేనాధుడు లేడు. గత సంవత్సరం కరువుచూసి ఇప్పుడు అప్పు ఇవ్వడానికి షావుకార్లు కూడా సిద్ధంగా లేరు.

ఈ సన్నివేశంలో షావుకార్లపై కోపంపెరిగి కొన్నిచోట్ల ఆదివాసులు షావుకార్లపై దాడి చేసింది. నేపధ్యం తెలిసినా ప్రభుత్వం ఆదివాసులపై దాడి చేయటానికి పూనుకొన్నది. లొద్దిగూడెం అనే గ్రామంలో షావుకార్లపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఎర్రబండ, కెరెగూడెం, టోకిగూడెం, దాంపూర్, నాగుపాడ, మంగి, జాముల్‌ధరి, తాడిగూడ గ్రామాలపై పోలీసులు మే నెల 14వతేదీ నాడు దాడి చేసి ఆదివాసులను విచక్షణా రహితంగా కొట్టి 90 మందిని అరెస్టు చేసారు. మరో 76మందికై గాలిస్తున్నారు. వీరందరిపై టెర్రరిస్టు చట్టం కింద కేసుపెట్టారు. ఈ గ్రామాల్లో ఆదివాసులకు టాడా పరిచయమైంది. ఇది ఎంత క్రూరమైన చట్టమో వాళ్ళకు తెలుసు, తండ్రిలేడని ఏడ్చే పిల్లలు, కొడుకులకై విలపించే తల్లులు, అరెస్టయిన భర్తపై బెంగతో బాధపడుతున్న స్త్రీలతో ఈ గ్రామాలను చూసిన ఏ మనిషికైనా కళ్ళ నీళ్ళు రాక మానవు. జీపు చప్పుడైతే మగవాళ్ళంతా అడవుల్లోకి పారిపోతున్నారు.

ఇంతటి దారుణమైన పరిస్థితిల్లో యుద్ధభూమిలో ఆయుధ శకటాలు తిరిగినట్టు పోలీసు జీపులు తిరుగుతున్నాయి కాని సహాయాన్ని అందించే మరో సర్కారు యంత్రాంగమేదీ కన్పించలేదు. కరువు పరిస్థితిపై స్థానిక అధికారులకు అవగాహన ఉన్నది. సహాయం చేయాలని తపన ఉన్నది. కానీ ప్రభుత్వ అండదండ లేదు. దాదాపు మూడు నెలల క్రితమే ప్రభుత్వం ఆదిలాబాద్‌ను కరువు ప్రాంతంగా గుర్తించింది. అయితే 43.41 కోట్ల రూపాయలు కరువు సహాయానికి అవసరం కాగా ప్రభుత్వం 49 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆదివాసులుండే పర్వత ప్రాంతాల్లోనే కరువు నివారణ చర్యలకు 19కోట్ల రూపాయలు కావాలి ప్రభుత్వ సహాయం వలన కరువుకు గురైన 4లక్షల సన్నకారు రైతుల, రైతు కూలీల కుటుంబాలకు సగటున 12 రూపాయలు వస్తుంది. దీని వలన వచ్చే లాభమేమీ లేదు. ఇప్పుడు ప్రభుత్వం చేయగల

---

(10వ పేజీ తరువాయి)

కృషిచేసిన వక్తలను పిలిపించి హైదరాబాద్‌లో రెండు రోజుల పౌరహక్కుల సదస్సు నిర్వహించాము. కార్యకర్తలలో పౌర హక్కుల అవగాహన పెంపొందించడానికి రాష్ట్రస్థాయిలో అనంతపురంలో, ఆయాజిల్లాలకు పరిమితమయి విశాఖపట్నంలోనూ ఒంగోలులోనూ, శ్రీకాకుళంలోనూ అధ్యయన తరగతులు నిర్వహించాము. కృష్ణాజిల్లాశాఖ నందిగామ, ఉయ్యూరువంటి తాలూకా కేంద్రాలలోనూ అధ్యయన తరగతులు నిర్వహించింది. ఈ కృషిని మరింత ముందుకు తీసుకుపోవడానికి సుశిక్షితులయిన కార్యకర్తలను తయారు చేసుకోవడం, అన్ని జిల్లాలలోనూ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. దానిని గురించి ఈ ప్రతినిధుల సభ చర్చించి రాష్ట్ర కార్యవర్గానికి సలహాలు సూచనలు ఇస్తుందని ఆశిస్తాము.

---

(11వ పేజీ తరువాయి)

యిచ్చే అధికరణం 23కి ఏదీ మినహాయింపు కాదనీ, 'రాజ్యాధికార నిర్వహణ'లో భాగంగా చేసే విధులమీద దావాలు చెల్లవని చెప్పే అధికరణం 300(1) కూడ మినహాయింపు కాజాలదనీ స్పష్టంగా వాదించింది.

నిజానికి, ప్రభుత్వ అధికార్ల చర్యలకు ప్రభుత్వం ఏ మేరకు బాధ్యత వహించాలన్న విషయాన్ని భారత రాజ్యాంగ కర్తలు దాటవేసారు. అధికరణం 300(1) ఏమంటుందంటే 'ఈ విషయంలో ఏదయినా (కొత్త) చట్టం జారీ అయ్యేదాకా రాజ్యాంగం రాకముందున్న పరిస్థితే కొనసాగుతుంది' అంటుంది. ఆ పరిస్థితి ఏమిటని భారతప్రభుత్వచట్టం (1935)ను పరిశీలిస్తే ఆచట్టం కూడా 'గత పరిస్థితే కొనసాగుతుంది' అంటుంది. ఇట్లా వెనక్కిపొతే మనకు అర్థం అయ్యేది ఏమిటంటే, తూర్పు ఇండియా కంపెనీ ఈదేశంలో ఆధిపత్యంనెలకొల్పిన తరువాత కంపెనీ అధికార్ల దుశ్చర్యలకు కంపెనీ ఏమాత్రంబాధ్యతవహించిందోఆబాధ్యత స్వతంత్రభారతప్రభుత్వంతనఅధికారులదుశ్చర్యల పట్లవహిస్తుంది. ఇది అధికరణం 300 (1)సారాంశం. ఈవిషయాన్నిసుప్రీంకోర్టు గుర్తించి,ఇప్పటికయినాఒకకొత్తశాసనంరూపొందించకపోవడంశోచనీయం అనిబాధవెలిబుచ్చింది.అయితే జస్టిస్‌జీవన్‌రెడ్డి భాస్కరరావులు అంతటితో ఆగకుండ, అధికరణం 21కి ఏమినహాయింపులూ లేవు కాబట్టి 300(1) కూడ దానికి మినహాయింపు కాజాలదని వాదించి, చల్లా చిన్నప్పరెడ్డి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు.

ఈ తీర్పును ఉపయోగించుకొని లాకప్పుమరణాల బాధితులంతా నష్టపరిహారం కోరడం మొదలు పెడితే ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో వున్న ప్రభుత్వానికి మరింత తలభారం అవుతుందని తమకు తెలిసినప్పటికీ చట్టబద్ధపాలన పెంపొందాలంటే ఇది అవసరం అని తాము భావిస్తున్నామని న్యాయమూర్తులన్నారు. ప్రభుత్వానికి తలభారం పెంచవలసిన బాధ్యత మనందరిమీదా వుంది.